

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 05-04-2023 | సంపుటి : 04 | సంచిక : 190 | పేజీలు : 4 | వెల : రూ 3-00



## జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

### పోస్టర్‌ను ఆవిష్కరించిన సజ్జల

అమరావతి,ఏప్రిల్4 : అన్ని వర్గాల అభివఅద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ, ఏప్రిల్ 7 నుంచి 20 వరకూ రాష్ట్రవ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు.'మా నమ్మకం నువ్వే జగన్ అనే మాట ప్రజల నుండి వచ్చిందని.. అందుకే ఆ పేరుతో కార్యక్రమం చేపట్టామని ఆయన పేర్కొన్నారు. 14 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 'ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలన్నదే మా ఆశయం. ప్రజలకు జవాబుదారీగా రాజకీయ పార్టీలు ఉండాలి. ప్రజలకు అనుగుణంగా పాలన ఉండాలి. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఉన్న తేడా వివరిస్తాం. సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును తెలియజేస్తాం' అని సజ్జల అన్నారు.'ఏడు లక్షల మంది సైనికులు 14 రోజులు సీఎం జగన్ తరపున ప్రతి కుటుంబానికి వెళ్లబోతున్నారు. 87 శాతం మంది ప్రజలు ప్రభుత్వం నుంచి నేరుగా ప్రయోజనం పొందారు. ఇలాంటి పరిస్థితి మన రాష్ట్రంలో తప్ప మరెక్కడా జరగలేదు. ప్రతిపక్షాల పేరుతో కొన్ని శక్తులు చేస్తున్న కుట్రలకు చెక్ పెట్టే కార్యక్రమం చేపట్టాం. ఏప్రిల్ నుంచి ఒక యజ్ఞంలాగా చేస్తున్నాం' అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.



## అందర్నీ కలిశాక అన్ని విషయాలు మాట్లాడతా: పవన్



దిల్లీ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దిల్లీ పర్యటన కొనసాగుతోంది. సోమవారం హస్తినకు చేరుకున్న పవన్.. కేంద్రమంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, మురళీధరన్‌తో సమావేశమైన విషయం తెలిసిందే.భాజపా ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గానూ ఉన్న మురళీధరన్‌తో పవన్ మరోసారి భేటీ అయ్యారు. మంగళవారం మురళీధరన్ నివాసంలో ఈ సమావేశం జరిగింది.రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణపై పవన్ చర్చిస్తున్నట్లు సమాచారం. జనసేనానితో పాటు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మీడియా ప్రతినిధులు పవన్‌ను కలవగా భాజపా ముఖ్యనేతలందరినీ కలిసిన తర్వాత అన్ని విషయాలు మాట్లాడతానని ఆయన చెప్పారు. సాయంత్రం కేంద్రహోంమంత్రి అమిత్‌షా, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఆయన భేటీ అయ్యే అవకాశముంది.

# నేడు విశాఖలో టిడిపి ప్రాంతీయ సదస్సు



### మినీ మహానాడు తరహాలో సదస్సు ఏర్పాట్లు
### పార్టీ నేతల్లో జోష్ నింపేలా చంద్రబాబు పర్యటన
### భారీగా ఏర్పాట్లు చేసిన టిడిపి నేతలు
### చంద్రబాబు రాకతో యువతలో ఆసక్తి



విశాఖపట్నం,ఏప్రిల్4): నాలుగు ఎమ్మెల్సీల గెలుపుతో టిడిపిలో జోష్ నిండింది. వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదే అన్న ధీమాలో పార్టీ నేతలు ఉన్నారు. ఇప్పటికే లోకేశ్ పాదయాత్రలో ఉండగా టిడిపి అధినేత చంద్రబాబు జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టబోతున్నారు. రానున్న రోజుల్లో టిడిపి మళ్లీ అధికారంలోకి వస్తుందన్న భరోసాలో పార్టీ నేతలు ఉన్నారు. చంద్రబాబు కూడా ఇక విజయం తమదే అన్న ధీమాలో ఉన్నారు. ఈ క్రమంలో చంద్రబాబు విశాఖ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ నేతల్లో జోష్ నింపేందుకు బాబు విశాఖ పర్యటనకు వస్తున్నారు. విశాఖ రాజధానిగా జగన్ హడావిడి చేస్తున్న తరుణంలో బాబు పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. తెలుగుదేశం ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహణకు జిల్లా పార్టీ నాయకులు ఐదు కమిటీలు ఏర్పాటుచేశారు. ఇందుకు సంబంధించి కార్యక్రమం ఖరారయ్యింది. ఈనెల ఐదో తేదీన నగరంలోని పోతినమల్లయ్యపా లెంలో గల 'వి కన్వెన్షన్' సెంటర్ లో ఉదయం పది నుంచి సాయం త్రం ఐదు గంటల వరకు జరగ నున్న సదస్సులో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొనను న్నారు. ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఐదు వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున. ..అందుకు తగినవిధంగా ఏర్పాట్లు చేసారు. ఇందుకోసం ఆహ్వానం, అలంకరణ, ఫుడ్, ఆర్గనైజేషన్, వలంటీర్ల కమిటీలు ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి పీఎంపాలెంలో వి.కన్వెన్షన్ సెంటర్ వరకు జాతీయ రహదారి పొడవునా పార్టీ జెండాల అలంకరణ బాధ్యత ను కార్పొరేటర్ల సాయంతో డెకరేషన్ కమిటీ చేపట్టనున్నది. సదస్సుకు వచ్చే నాయకులు, ఇన్‌చార్జులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులకు భోజనం అందించే బాధ్యతను ఆహార కమిటీ తీసుకోను న్నది. ఈ సదస్సులో ప్రస్తావించా ల్సిన అంశాలపై కూడా చర్చించారు. పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, విశాఖ, అనకావల్లి జిల్లాల పార్టీ ఇన్‌చార్జి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మం త్రులు బండారు సత్యనారా యణ మూర్తి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివా సరావు, బుద్దా నాగజగదీశ్వరరావు, నియో జకవర్గ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, వంగలపూడి అనిత, పీలా గోవింద సత్యనారాయణ, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, కోళ్ల లలితకుమారి తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. మినీమహానాడు తరహాలో సదస్సు ఏర్పాటు చేశారు. అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని రానున్న ఎన్నికల్లో సాగనంపాలని మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేయడంతో పాటు రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు.

# పలాస ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ అడ్డానే: మంత్రి సీదిరి అప్పలరాజు



అమరావతి: 175 అసెంబ్లీ స్థానలకు 175 గెలవాలనే లక్ష్యంతో పనిచేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు తాడేపల్లి మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు.సీఎం చాలా సానుకూల ధృకృథంతో ఉన్నారని, మరింత ప్రజలకు చేరువ కావాలని సూచించారని చెప్పారు. 'మొన్న మంత్రి పదవి తీసేస్తారని ప్రచారం చేశారు. ఈరోజు ఎమ్మెల్యేగా పీకేస్తారని దుష్ప్రచారం చేస్తున్నారు. పలాస ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ అడ్డానే. సాఫ్ట్ టార్గెట్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తా. పలాసలో ఏం జరిగినా అప్పలరాజే కారణమని టీడీపీ ప్రచారం చేస్తోంది' అని విమర్శించారు.ఆగస్టు నాటికి గడపగడపకు కార్యక్రమం పూర్తి చేయాలని సీఎం జగన్ చెప్పారని మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి గడప గడపకు వెళ్లాలని సీఎం సూచించారని తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి 21 వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉంటుందని, దీనిపై సీఎం దిశానిర్దేశం చేశారన్నారు. ప్రతిపక్షాలు లేనిపోని అపోహాలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్తామని సీఎం స్పష్టం చేశారని చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని వైఎస్ జగన్ ఆదేశించారన్నారు. రామోజీరావు ధృతరాష్టుడిగా మారిపోయాడు పేదల కోసం చంద్రబాబు, రామోజీ ఆలోచించారా అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రశ్నించారు. పేదల రక్తమాంసాలతో వ్యాపారం చేసిన వ్యక్తులు చంద్రబాబు, రామోజీరావు అంటూ ధ్వజమెత్తారు. తమకు ఓటేసినా.. వేయకపోయినా ఇంటింటికీ వెళ్లి పథకాలు అందిస్తున్నామని తెలిపారు.

# విపక్షాలవి అన్నీ అబద్దాలే

### మంత్రి బుగ్గన



అమరావతి. ప్రతిపక్షాల పత్రికా ప్రకటనలు, కొన్ని పత్రికల్లో రాస్తున్న కథనాలు ..అన్నీ అబద్ధాలేనని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాధ్ రెడ్డి అన్నారు. మార్చి 31 , 2023 నాటికి వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు రూ. 1,64,725 కోట్లే. టీడీపీ హయాంలో కేంద్రం కన్నా రాష్ట్రం రెండింతల అప్పులు చేసింది. 2018?19 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ 59,729 కోట్లు వేస్ అండ్ మీన్స్ నిజం కాదా ? మొత్తం వడ్డీ ఏడాదికి రూ.25,754 కోట్లయితే..మరి రూ.లక్ష కోట్లు వడ్డీ అని ఎవరిని భయపెట్టడం కోసమని ప్రశ్నించారు.స్థిరమైన అభివృద్ధి లక్షాలలో ఏపీది 4వ స్థానం..మరి 13వ స్థానం అనడం దుష్ప్రచారమే కదా? 2019లో ఏపీ, తెలంగాణల తలసరి ఆదాయంలో భారీ తేడాకు కారణం మీరే కదా? వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయికి లెక్క పక్కాగా ఉంది.
అర్హతే ప్రామాణికంగా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాలకే రూ 2,05,109 కోట్లు అందించిన రాష్ట్రం ఏపీ ఒక్కటేనని అన్నారు.
" ఖజానా ఖాళీ!, రూ.100కోట్ల నిధి మాత్రమే మిగిలింది. ఎక్కడెక్కడ అప్పులొస్తాయో అన్నీ తెచ్చేశాం. ఒక్క రూపాయి కూడా ఇక అప్పు పుట్టదు. వైసీపీ ప్రభుత్వం మొదటి 6 నెలల్లోనే అప్పుదొరకక ఆదాయం లేక ఇంటికి వెళుతుంది" అంటూ గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా చేసిన యనమల వేర్వేరు సందర్భాలలో చేసిన వ్యాఖ్యలివి! ఇప్పుడేమో రాష్ట్రం అప్పు రూ. 12.5 లక్షల కోట్లు దాటనుందని జోస్యం చెబుతున్నారు. అలాగే చంద్రబాబు గారు కూడా రాష్ట్రం అప్పు రూ. 10.31 లక్షల కోట్లు చేరిందని ఆయనే నిర్ధారించి సభల్లో ఇష్టమొచ్చినట్లు ప్రకటిస్తున్నారు. కొద్ది నెలల క్రితం వరకూ ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంకగా, నైజీరియాగా, జింబాబ్వేగా మారబోతోందని ప్రతిపక్ష నేతలు ఇలాగే గగ్గోలు పెట్టారు. టీడీపీ నాయకులలో రాష్ట్ర ఆర్థిక స్థితిపై సరైన అవగాహన లేక నోటికి వచ్చినట్లు పచ్చి అబద్ధాలు చెప్పడమే పనిగా పెట్టుకున్నారు. ఈ దుష్ప్రచారాలతో రాష్ట్ర ప్రజలలో ఒక రకమైన గందగోళాన్ని సృష్టించి రాజకీయ లబ్ది పొందాలని విఫల యత్నంచేస్తున్నారని ఆరోపించారు.వాస్తవానికి , మే నెల, 2019 లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పు రూ.2,71,797 కోట్లు. మార్చి 31 , 2023 నాటికీ రాష్ట్రం అప్పు రూ. 4,36,522 కోట్లు. ఈ లెక్కల ప్రకారం, ఈ నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులు అక్షరాలా రూ.1,64,725 కోట్లు మాత్రమేనని అన్నారు. తలసరి అప్పు రూ. 5.5 లక్షలని, అప్పులపై సంవత్సరానికి లక్ష కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తుందని సొంత లెక్కలు చెబుతూ యనమల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇవి ముమ్మాటికి ప్రజలను తప్పు దోవ పట్టించే తప్పుడు లెక్కలు, పచ్చి అసత్యాలన్నది వాస్తవం. సెన్సస్-2011 ఆంధ్రప్రదేశ్ జనాభా 4.96 కోట్లు. ఈ జనాభా ప్రకారం తలసరి అప్పు రూ.88,008 మాత్రమే. అప్పులపై వడ్డీ చూస్తే 2022 - 23కి రూ. 25,754 కోట్లు మాత్రమే. ఒక మాజీ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి కూడా కనీస బాధ్యత లేకుండా రూ.లక్ష కోట్లు వడ్డీ కడుతుందని చెప్పడమంటే ముమ్మాటికి ఇది రాజకీయ ప్రయోజనాలు మినహా నిజాలు లేవని ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు ఏమైనా పర్వాలేదు, యువత భవిష్యత్తు నాశనమైనా మాకేం పోదు, పేదవారు కష్టాల ఊబిలో కూరుకుపోయినా మాకు సంబంధం లేదు, మాకు కేవలం వైసీపీ ప్రభుత్వాన్ని అసత్యాలతో, అనుకూల మీడియాతో భయాందోళనలోకి ప్రజలను నెట్టి ఎలాగైనా తిరిగి అధికారంలోకి రావాలని టీడీపీ పన్నిన దుష్ట పన్నాగం కాక మరేమిటని నిలదీసారు.
వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయికి లెక్క ఉంది. ప్రతి పైసా ప్రజలకు అవినీతి లేకుండా వారి ఖాతాలకు జమ అయింది. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నవరత్నాలలో భాగముగా 26 సంక్షేమ పథకాలకు ఎస్సి, ఎస్టి, బీసి, పేద ,మధ్యతరగతి ప్రజలకు నేరుగా సుమారు రూ 2,05,109 కోట్లు డీబీటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తుంటే ప్రతిపక్షాలు కడుపు మంటతో అర్థం లేని విమర్శలు చేయడం శోచనీయం. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సిఫారసు మేరకు, రాజకీయ నాయకుడికి దగ్గరగా ఉన్న అనుకూల వర్గాల వారినే లబ్ధిదారులుగా ఎంచుకున్నారు. వారి లక్ష్యం స్వార్థపూరితం.. కావడం వల్ల అర్హత ఉన్నా కూడా ఫలాలు అందని పేద ప్రజలెందరో నాటి ప్రభుత్వ హయాంలో. కానీ ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హత ఉన్న ప్రతి లబ్ది దారునికి కుల,మత, ప్రాంత,వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుంది. ఎవరి సిఫారసులు అక్కర లేదు.. కేవలం అర్హతే ప్రామాణికమని అయన అన్నారు.

## ఉమ్మడి కృష్ణా జిల్లా రాజకీయాల్లో నిబద్ధత అంకితభావంతో పనిచేసిన వ్యక్తి

### మెట్ట ప్రాంత రైతాంగ గొంతుక కంచి రామారావు
### - దేవినేని ఉమామహేశ్వరావు

అమరావతి. గ్రామ సర్పంచిగా ప్రారంభమైన రాజకీయ జీవితం గల్లి నుంచి ఢిల్లీ దాకా రాజకీయాలు నడిపిన వ్యక్తి కంచి రామారావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు అన్నారు. మంగళవారం నాడు మాజీ ఎమ్మెల్యేకు నల్లగట్ల స్వామిదాసు, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), పార్టీ ఇన్చార్జి సేవల దేవదత్ మరియు స్థానిక నేతలతో కలిసి తిరువూరులో ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... కంచి రామారావు లేని లోటు ఈ ప్రాంతానికి, పార్టీకి, ముఖ్యంగా మెట్ట రైతందానికి తీరని లోటుభగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నజాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గారికి విషయం తెలియగానే సంతాపం తెలియజేయటం జరిగిందిశాసనసభ్యుడుగా నేను ఉన్న ప్రతి డి డి ఆర్ సి, డి ఆర్ సి మీటింగు లో కంచి రామారావు మెట్ట రైతాంగ చెరువులు గురించి, నీళ్ల గురించి, నాగార్జునసాగర్ కాలువ నీళ్ల కోసం, వేంపాడు చుట్టుపక్కల ప్రాంతాల్లో లిఫ్ట్ కాలువలు అభివృద్ధి పట్ల ఆయన మాట్లాడని సమావేశం లేదుఈ ప్రాంత రైతాంగ కష్టాల పట్ల చెరువులకు నీళ్లు ఎలా రావాలి సాగర్ నీళ్లకు శాశ్వత పరిష్కారం ఏంటి అని ప్రశ్నించేవారుమా ప్రాంతంలో వేదాద్రి లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టడం పట్ల చాలా సంతోషించేవారురాష్ట్రం పట్ల ప్రాంతం పట్ల ఒక చిత్తశుద్ధి, క్రమశిక్షణ, అంకితభావం ఉన్న వ్యక్తితిరువూరు ప్రాంతాల నుంచి వెళ్లి మార్కెట్ ఛైర్మన్ చేయడం ఎంతోమంది డబ్బులు తీసుకురావడం సామాన్యమైన విషయాలు కావుఢిల్లీ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో ఆయన చేసిన పదవులకు గౌరవం తీసుకొచ్చారు



# సంపాదకీయం


బుధవారం 05-04-2023

## ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్న దొంగ ఓట్లు

ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినప్పటికీ, ప్రజాస్వామ్య ఉద్దేశానికి, శాసనమండలి చట్టసభ ప్రాధాన్యతలకు తీవ్ర భంగం కలిగిందని చెప్పవచ్చు. సాక్షాత్తు ముఖ్యమంత్రే గతంలో ఎన్నడూ లేని విధంగా నేరుగా ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వకముందే అభ్యర్థుల ఖరారుతో తన రాజకీయ వ్యూహం మొదలు పెట్టారు. ఆయా పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలను బాధ్యులను చేసి వారికి గెలుపు టార్గెట్‌గా నిర్దేశించిన సంగతి తెలిసినదే. అక్కడితో ఆగకుండా ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో బినామీ ఓట్ల చేర్పుల నుండి, నేటి దొంగ ఓట్లు పోలింగ్ వరకు అధికార పక్షం తన అధికారంతో అనేక అవకతవకలకు పాల్పడిన సంఘటనలు కోకొల్లలు. అవకాశం లేని ప్రతిపక్షాలు ఎన్నో ఆందోళనలు, ఎన్నో ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి ఇచ్చినప్పటికీ వారికి కలిగింది ఓదార్పు చర్యలు తప్ప మరేమీ జరగలేదు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, సవరించిన చట్టాలు, నిరంతర నిఘా సంస్థలు, ఓటరు చైతన్యం వెరసి ఇవేమీ బినామీ, దొంగ ఓట్ల చేర్పులు, దొంగ ఓట్ల పోలింగ్‌ను నివారించలేక, నిర్ధారించలేక విఫలమయ్యాయనడానికి ఈ శాసనమండలి ఎన్నికలలో పట్టభద్రులకు బదులుగా 6, 7, 9 తరగతుల వారిని ఓటర్లుగా నమోదు చేయడాన్ని, ఓటర్లు పోలింగ్ బూత్‌లలో ఒప్పుకున్న సంఘటనలు, వారు ధైర్యంగా ఓటేసిన దృశ్యాలు వివిధ మాధ్యమాలలో చూశాం. అంతే కాకుండా ప్రైవేట్ ఉపాధ్యాయుల పేరుతో అనర్హులను అనుమతించిన అధికారులు దీనిపై ఉన్నత న్యాయ స్థానం చివాట్లు పెట్టినప్పటికీ యధాతథంగా కొనసాగించిన తీరు. స్థానిక సంస్థల ప్రాతినిధ్యంలో రాజకీయ, ఆర్థిక లాలూచీలతో అక్రమ ఏకగ్రీవాలు... ఇవే కాకుండా క్యాంపులు, విందులు, వినోదాలు, హామీలు, చెల్లింపులతో ఎన్నికలను అంతా తామై వ్యవహరించి అధికార పార్టీ నాయకులు, అధికారులు ధన్యులైనారు. ఓటు విలువ(ధర), దానికై వెంపర్లాడిన ఓటరు చైతన్యం ఈ ఎన్నికలలో బాగానే విజయవంతమైంది. ముఖ్యంగా ఓటుకు నోట్లు డిమాండ్ చేసి మరీ అందుకున్నారన్న అపవాదును ఉపాధ్యాయులు మూట కట్టుకున్నారు. ఐదునుండి పదివేల దాకా ధర పలికిందన్న ప్రచారం కొనసాగింది. ఇది ఆయా వ్యక్తులకే కాదు ఉపాధ్యాయ వృత్తికి జరిగిన అవమానం.. ఎన్నికల సరళి పరిశీలిస్తే విజయమే కొలమానంగా అధికార పార్టీ ఎన్నికలను వ్యూహాత్మకంగా నిర్వహించిందని చెప్పవచ్చు. పైగా పాలనా విధానాలపై అసంతృప్తులుగా ఉన్న ఉద్యోగులలో, నిరుద్యోగులలో, ఉపాధ్యాయులలో, స్థానిక సంస్థల ప్రతినిధులలో ఆ కసి కనిపించలేదు. అన్ని వర్గాలు నాటి అసంతృప్తి మరచి, నేటి సంతృప్తి కోసం ఎదురు చూసిన సంఘటనలు దీనికి నిదర్శనాలు. ఓటుకు విలువ (ప్రాధాన్యత)తగ్గినా.. ఓటుకు విలువ(ధర) పెరిగిందన్న చర్చ ఓటర్లలో సాగుతోంది. ఓటును ఆయుధంగా మార్చుకొని, సామాజిక రక్షణకోసం ఉపయోగించుకోవాలన్న డాక్టర్, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా ఆయుధం కాదు ఆదాయంగా వాడుకుంటామంటున్న చదువుకున్న ఓటర్ల తీరు భవిష్యత్ సమాజానికి, ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రమాదకరంగా భావించాలి. ఓటు అనే ఆయుధాన్ని సక్రమ మార్గంలో ప్రయోగించకుండా, తాత్కాలిక తైలాలతో, తాయిలాలతో నిరంతరం దాన్ని తుప్పు పట్టిస్తూ... అవసరమైనప్పుడు తమ కోసమే వినియోగించుకోవడానికి రాజకీయ పార్టీలు, నాయకత్వాలు అలవాటుపడిపోయాయి. ఈ నేపథ్యంలో వీరి కనుసన్నల్లో నడుస్తూ బాధితులుగా ఉన్న మధ్యతరగతి ప్రజలలో మార్పు రానంత కాలం అధికారం ఆ రెండు పార్టీల చేతులు మారుతుంది తప్ప ప్రజల తల రాతలు మారవన్నది ఈ ఎన్నికల సారాంశంగా భావించాలి. దేశం బాగుపడాలన్నా... రాష్ట్రం బాగుపడాలన్నా...మంచి పాలన, పాలకులు అవసరం. వారిని ఎన్నుకొనే ఓటరు ఓటుకు నోటు తీసుకునే అవినీతిలో భాగమౌతూనే మరోవైపు పాలకుల నుంచి నీతివంతమైన పాలన కోసం ఎదురుచూస్తుండడం అమాయకత్వమే అవుతుంది. ఈ సమస్యకు పరిష్కారం ఓటరు చైతన్యమే...అది సాధ్యమా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# 7 నుంచి జగన్ కొత్త ప్రచారం

విజయవాడ, ఏప్రిల్ 4, 2024 ఎన్నికల మెగా బ్యాటిల్‌కు ప్రజల మద్దతును పొందేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 'మాస్ ఇంటరాక్షన్ స్ట్రాటజీ'ని రచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఒక్కరికీ ఉమ్మడి సందేశాన్ని చేరవేసేందుకు 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించబోతున్నారు. ఎన్నికలకు ఏడాది ముందు నుంచే ఎన్నికల ప్రచారానికి వైఎస్ఆర్సీపీ సమరశంఖం పూరించబోతోంది. 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో ఇప్పటివరకు కనీవినీ ఎరగని రీతిలో సరికొత్త ఎన్నికల ప్రచారం ప్రారంభించబోతోంది. మొదటి దశ ఏప్రిల్ 7 నుంచి 20వరకు అంటే రెండు వారాల పాటు ఈ క్యాంపెయిన్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని ఇంటింటికి ఈ ప్రచారాన్ని తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలుస్తోంది. వైఎస్ఆర్సీపీ వర్గాలు అందిస్తున్న సమాచారం ప్రకారం రెండువారాల పాటు అంటే ఏప్రిల్ 7-14వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' క్యాంపెయిన్ స్టార్ట్ అవుతుంది. కొత్తగా నియమితులైన జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహ సారథిలు ఇందులో ప్రధానంగా పాల్గొంటారు. దాదాపు 7లక్షల మంది జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆంధ్రప్రదేశ్ లోని 1.65 కోట్ల ఇళ్లకు వెళ్లి ఈ ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారురాజకీయ వర్గాల్లో ప్రతిధ్వనించేలా వైఎస్ఆర్సీపీ క్యాడర్ ఏకగ్రీవంగా సందేశాన్ని ప్రసారం చేస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అట్టడుగు వర్గాలకు రెండు కీలక సందేశాలను పంచుతుందని నాయకులు వివరించారు. ఇంటింటికీ ప్రచారంలో భాగంగా వైఎస్ఆర్సీపీ బృందాలు కరపత్రాలు, పుస్తకాలు, స్టిక్కర్లు పంపిణీ చేస్తారు. "గతంలో ఏం చేశారు ఇప్పుడేం చేస్తున్నారని కరపత్రంలో ముద్రించి




అందిస్తారు. 2019లో జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన తరువాత చేసిన అభివృద్ధి-సంక్షేమ పనులు, చంద్రబాబునాయుడు హయాంలో చేసిన పనులను పోలుస్తూ తయారు చేసిన పాంప్లెట్లను ఇంటింటికి పంచుతారు. 'ప్రజా మద్దతు పుస్తకం' కింద ప్రశ్నాపత్రాన్ని పూరించి, నివాసితులకు రసీదు ఇస్తారు. 'డోర్, మొబైల్ స్టిక్కర్లను అందిస్తారు. కుటుంబ యజమాని అనుమతితో ఫోన్, డోర్‌పై అతికిస్తారు. 'మిస్డ్ కాల్' కార్యక్రమం కింద, జగనన్న పాలనకు తమ మద్దతును తెలియజేయడానికి 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని వారు ఇంటింటా అభ్యర్థిస్తారు. ఈ వినూత్న ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ నేరుగా ప్రజలతో మమేకం కావడానికి సహాయపడుతుందని వైఎస్ఆర్సీపీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మౌనంగా జేసీ బ్రదర్స్



అనంతపురం, ఏప్రిల్ 4, మేం ట్రెండ్ సెట్ చేస్తాం తప్ప? ఫాలో కాము. ? ఇదీ? జేసీ బ్రదర్స్ తమ పనుల ద్వారా బయటి ప్రపంచానికి చెప్పే మాట. అందులోనూ దివాకర్‌రెడ్డి కంటే ప్రభాకర్‌రెడ్డికి ఇంకా దూకుడు ఎక్కువ. అవతలోడు ఎవడైతే నాకేంటి అన్న రీతిలో ఉంటాయి ఆయన చర్యలు. అయితే? జగన్ సర్కార్ వచ్చాక ఈ పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. అయినా వైఖరి మాత్రం మారలేదు. తాడిపత్రిలో దశాబ్దాలుగా కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ కుటుంబాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. అంతకుముందు జేసీ ఫ్యామిలీ ఆధిపత్యమే నడిచినా?.2019 ఎన్నికల తరువాత పెద్దారెడ్డి పట్టుబిగించారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నియోజకవర్గంలో జరిగే పనుల విషయంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ? మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రం అయ్యాయి. దీంతో నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు టెన్షన్ వాతావరణం నెలకొంటోంది. ఎమ్మెల్యేను ఉద్దేశించి ప్రభాకర్‌రెడ్డి ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్య చేయడం.. దాని మీద రచ్చ కావడం సర్వ సాధారణమైపోయింది. కానీ? ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే ఏమనుకున్నారో ఏమో రూట్ మార్చారు. ఎప్పుడూ ఎదుటి వాళ్ళని తిడుతూ కూర్చుంటే? మనకు వచ్చేదేంటన్న రియలైజేషన్ వచ్చిందో ఏమో కానీ? ఆయన తాత్కాలికంగా తిట్ల దండకానికి బ్రేక్ ఇచ్చారు. సాధారణంగా జేసీ బ్రదర్స్ ఎప్పుడూ జనంలోనే ఉంటారు. కానీ? ఇప్పుడు ఇంకాస్త డోస్ పెంచారు ప్రభాకర్‌రెడ్డి. ప్రత్యర్థి మీద రాజకీయ సవాళ్ళు, ప్రతి సవాళ్ళను పక్కనపెట్టి నియోజకవర్గంలోని సమస్యల మీద మాత్రమే స్పందిస్తున్నారు ప్రభాకర్‌రెడ్డి. ఎక్కడెక్కడ ఏయే సమస్యలున్నాయి? వాటికి పరిష్కారం ఎలాగన్న విషయాలను అనుచరులు, కార్యకర్తల మధ్య కూర్చుని చర్చిస్తున్నారు. తరచూ అందర్నీ కలుస్తూ? వాళ్ళలో ఒకడిగా మారిపోతున్నారు తప్ప ఎమ్మెల్యే మీద ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం లేదు. అదే టైంలో విచిత్రంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి జేసీ స్టైల్లోకి వచ్చారు. ప్రస్తుతం పాదయాత్రల పేరుతో జనం మధ్యకు వెళ్తున్నారు ఎమ్మెల్యే. ఇప్పటికే పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో పాదయాత్ర ముగించారు. అక్కడ ఆయన మాట్లాడే మాటలు హీట్ పెంచేస్తున్నాయి. ఇంకాస్త ఎక్కువైతే మొదటికే మోసం తెచ్చేలా ఉన్నాయన్నది లోకల్ వైసీపీ టాక్. జనం మధ్యకు వెళ్తున్న ఎమ్మెల్యే ప్రజల సమస్యలు వినకుండా? జేసీ ప్రభాకర్ రెడ్డిని దూషించేందుకు ఎక్కువ టైం కేటాయిస్తున్నారన్న చర్చ ప్రజల్లో జరుగుతోంది. దీనికి తోడు ఎమ్మెల్యే వెంట వచ్చిన ఇతర నేతలు సైతం మాజీ ఎమ్మెల్యేని టార్గెట్ చేసి మాట్లాడుతున్నారు. ఇంత మంది ఎన్ని మాట్లాడినా.. జేసీ మౌనంగా ఉండటం మాత్రం ఆశ్చర్యంగా ఉందంటున్నారు స్థానికంగా గమనిస్తున్నవారు. ప్రత్యర్థి ఎవరైనా చిన్న మాట అంటేనే తోకతొక్కిన తాచులా విరుచుకపడే జేసీ? ఇంత కూల్‌గా ఎందుకు ఉంటున్నారనేది అందరి మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్న. తన ప్రత్యర్థులు ఎంత తిట్టినా.. ఆయన మాత్రం నో మేటర్ అన్నట్టుగా కనిపిస్తున్నారు. అంతే కాదు.. నియోజకవర్గంలో గతంలో మాదిరి నిరసనలు తెలియజేసే ప్రయత్నం ఎక్కడా కనిపించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల సమయంలో మాత్రం సీఎం జగన్ పై విమర్శలు చేసిన ప్రభాకర్‌రెడ్డి తర్వాత సైలెంటైపోయారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిలో ఉన్నట్టుండి ఈ మార్పు ఎందుకు వచ్చిందన్న చర్చ ఇప్పుడు తాడిపత్రి పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది. ఇది దేనికి సంకేతమని మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో గతానికి భిన్నంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి దూషణల పర్వానికి తెరలేపడాన్ని కొత్తగా చూస్తున్నారు నియోజకవర్గ ప్రజలు.

# 45 మంది ఎమ్మెల్యేలపై జగన్ అసంతృప్తి

విజయవాడ, ఏప్రిల్ 4, పార్టీలోని శాసనసభ్యులను నాలుగు వర్గాలుగా విభించి వారిని ఆయా వర్గాల వారీగా ట్రీట్ చేయాలని సీఎం జగన్ భావిస్తున్నారని పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇందులో మొదటి కేటగిరి, సీట్ ఇస్తే గెలిచేవారు. రెండో ది సీట్ ఇస్తే ఓడిపోయేవాళ్లు, మూడోది సీట్ ఇవ్వకపోతే వేరే పార్టీలో చేరేవారు...నాలుగోది పార్టీ లోనే ఉండి నష్టం కలిగించేవారు. ఇలా నాలుగు రకాలుగా ఎమ్మెల్యేల విభజన చేపట్టి వారిని ఆయా పరిస్థితులకు అనుగుణంగా పనిచేయించుకోవటం, లేదంటే ఎన్నికల సమయంలో పూర్తిగా పక్కన పెట్టటం వంటి పరిస్థితులపై జగన్ ఈ సమావేశంలో శాసనసభ్యులకు ప్రత్యక్షంగా పరోక్షంగా స్పష్టం చేయనున్నారని అంటున్నారు. తాజా సర్వేల ఆధారంగా ఎమ్మెల్యేలపై అంచనా చేసినట్లుగా చెబుతున్నారు. అందులో 45 మంది ఎమ్మెల్యేలపై జగన్ మోహన్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నారని కూడా పార్టీలోని నాయకులు అంటున్నారు. వారి స్థానాల మార్పునకు జగన్ నిర్ణయించారని అంటున్నారు. ఇందులో భాగంగా సీట్ మార్పు శాసనసభ్యులకు జూన్ వరకు కొంత టైం ఇచ్చే అవకాశం కూడా లేకపోలుదని చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉన్న సర్వేల ఆధారంగా సమాచారం తెప్పించుకున్న జగన్ 30 మంది ఎమ్మెల్యేకు తిరిగి టిక్కెట్ ఇచ్చే విషయంలో డౌట్ గా ఉన్నారని పార్టీ వర్గాలు అంటున్నారు. ఏప్రిల్ లో జరిగే సమావేశం ద్వారా నేతల పనితీరుపై ఒక నిర్ణయానికి వస్తానని గతంలోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చెప్పారు. దీంతో ఈసారి సమావేశంలో ఎవరి భవిష్యత్ ఏంటనే దానిపై సీఎం ఓ క్లారిటీ ఇచ్చేస్తారంటున్నారు పార్టీ నేతలు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పనితీరు పైనా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందంటున్నారు పార్టీ నేతలు. సీఎం జగన్ ఢిల్లీ టూర్ తో కేబినెట్ లో మార్పులు తప్పవనే ప్రచారం తెర మీదకు వచ్చింది. అదే సమయంలో శాసనసభ్యులతో సమావేశంలో జగన్ దూకుడుగా నిర్ణయాలు ప్రకటించనున్నారు. ఇటీవల కాలంలో జగన్ గవర్నర్ తో సమావేశం ఆ తరువాత వరుసగా రెండు సార్లు ఢిల్లీ పర్యటన తరువాత పరిస్థితుల్లో మార్పులు స్పష్టంగా ఉన్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. మొదటి కేబినెట్ లో పనిచేసిన ఇద్దరికి తిరిగి అవకాశం ఇవ్వటంతో పాటుగా, కొత్తగా కొంతమందికి మంత్రి వర్గంలో చోటు ఇవ్వొచ్చని చర్చ జరుగుతుంది. ఏపీలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ప్రజలు తిరుగులేని ఆధిక్యాన్ని కట్టబెట్టారు. అభ్యర్థుల పేరు ప్రతిష్టలతో సంబంధం లేకుండా జగన్ సృష్టించిన సునామీలో భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు గెలుపొందారు. రాష్ట్రంలో 151 స్థానాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తైన తర్వాత ఎమ్మెల్యేలు వెనుదిరిగి చూసుకుంటే, చాలా మందికి చెప్పుకోడానికి ఏమి కనిపించడం లేదు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు, మంత్రులు అనే తేడా లేకుండా అందరిని ముఖ్యమంత్రి నియంత్రణలో ఉంచుకున్నారు. ప్రాంతీయ పార్టీల్లో ఈ తరహా రాజకీయాలు సాధారణమే అయినా అంతకు మించిన ఆంక్షలు, వ్యూహాలను వైసీపీ అధినేత అమలు చేశారు. ప్రజా ప్రతినిధుల అవినీతిని ఉపేక్షించేది లేదని మొదట్లోనే స్పష్టం చేశారు. మంత్రులకు శాఖలు అప్పగించినా వాటిలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా ఉన్నత స్థాయిలో అమోదం ఉంటే తప్ప అమలు చేయలేని పరిస్థితి కల్పించారు. ఏపీలో అధికార పార్టీకి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రజా ప్రతినిధుల గెలుపు బాధ్యతలు తమవేనని ముఖ్యమంత్రి మొదట్నుంచి అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు. అవినీతి కార్యక్రమాలకు దూరంగా ఉండాలని మొదట్లోనే అందరిని హెచ్చరించారు. పదవిలో ఉండగా సంపాదించుకోవాలనే ఆలోచనలు వదులుకోవాలని స్పష్టం చేశారు. ఇది ఎమ్మెల్యేలకు రుచించకపోయినా చేసేదేమి లేక కాలం నెట్టుకొచ్చారు. వాటి ఫలితాలు ఇప్పుడు అర్థమవ్వడంతో ఎమ్మెల్యేలు కలత చెందుతున్నారు.

# మిర్చి పంటను తగలబెట్టిన దుండగులు

విజయవాడ ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కంభంపాడు గ్రామంలో పంట పొలంలో చేతికొచ్చిన 10 లక్షల విలువచేసే 40 క్వింటాళ్ల మిర్చిని పెట్రోల్ పోసి గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. బాధిత రైతు ఉయ్యూరు రామారావు లబోదిబోమ్మంటూ కన్నీరు మున్నీరయ్యాడు. అప్పు చేసి పంట పండించి చేతికొచ్చిన పంట కళ్ళ ముందే తగలబడటంతో బోరున విలపించాడు. మంటలు దూకి ఆత్మహత్య చేసుకోబోయిన రైతును గ్రామస్తులు అడ్డుకున్నారు.

# మెట్లమార్గానికి మోక్షమెప్పుడు..?



తిరుమల, ఏప్రిల్ 4, కలియుగ శ్రీనివాసుడు పై అపారమైన భక్తిభావంతో గోవిందనామాలు స్మరించుకుంటూ మొక్కుబడిగా మెట్టుమెట్టుకు నమస్కరించుకుంటూ వేల సంఖ్యలో భక్తులు పురాతన మార్గమైన నడకదారిలో ఏడుకొండలవాడి చెంతకు చేరుకుంటారు. తిరుమల చేరుకోవడానికి ఉన్నవి రెండు నడకమార్గాలు. ఒకటి అలిపిరి, మరొక్కటి శ్రీవారి మెట్టు మార్గం. తిరుపతి నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో చంద్రగిరి పట్టణానికి సమీపంలో ఉండేది ఈ శ్రీవారి మెట్టు నడకమార్గం, పద్మావతి అమ్మవారిని కళ్యాణం చేసుకున్న తరువాత సాక్షాత్తు ఆ స్వామి అమ్మవార్లు కొండపైకి నడిచివెళ్లిన మార్గం కాబట్టే దానికి శ్రీవారి మెట్టు నడకమార్గంగా ప్రసిద్ధి చెందిందిఇంతటి ప్రాశస్త్యం కలిగిన నడకమార్గం గతేడాది నవంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దాదాపు 500 పైగా మెట్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. నాలుగు కల్వర్ట్‌లతో పాటు మెట్లకు ఇరువైపులా ఉండే రిటైనింగ్ వాల్స్ ధ్వంసమైపోయాయి. వరద ప్రభావంతో శ్రీవారి మెట్టు నడకమార్గం గుర్తుపట్టలేనంత.. పెద్దపెద్ద బండరాళ్లు, గుండులు, మట్టిపెళ్లలు, కొండచరియలతో నిండిపోయింది. తిరుమల చరిత్రలో మొదటిసారి మెట్లమార్గం భారీస్థాయిలో దెబ్బతింది. గత ఏడాది నవంబర్ 19వ తేదీ శ్రీవారి మెట్టు నడకమార్గాన్ని టీటీడీ మూసివేసింది. శ్రీవారి మెట్టు మార్గంలో రోజూ టీటీడీ 6వేల సర్వదర్శనం టోకెన్లు మంజూరు చెసేది. ప్రస్తుతం ఆ మార్గాన్ని మూసి వేయడంతో కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పాదయాత్రగా వచ్చే గోవింద మాలధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనంగా 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఇక నెల రోజుల్లో శ్రీవారిమెట్టు మార్గం పనులు పునరుద్ధరణ చేస్తామని చెప్పారు అధికారులు.. అయితే 5 నెలల గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు, భక్తులు ఆరోపిస్తున్నారు. 800వ మెట్టు, 1200వ మెట్టు వద్ద 30 అడుగుల వెడల్పు, 30అడుగుల లోతు గోతులు ఏర్పడ్డాయి. వాటిని పునర్నిర్మాణం చేయడానికి చాలా సమయం పట్టేట్లు ఉంది. మరో 2 నెలల గడిచినా పనులు పూర్తయ్యే అవకాశం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు భక్తులు.

# ఆత్మీయ సమ్మేళనాలు.. అసమ్మతి రాగాలు

విజయవాడ, ఏప్రిల్ 4,రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆత్మీయ సమ్మేళనాల హల్‌చల్ నడుస్తోంది. ఎన్నికలు సమీపిస్తోన్న వేళ రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థానిక నినాదం ఊపందుకుంది. ఎక్కడినుంచో వచ్చినోళ్ళు కాదు.. ఇక్కడ మేం లోకల్ అంటున్నారు స్థానిక నేతలు. అందుకు ఆత్మీయ సమ్మేళనాలు? సమీకరణలు?సవాళ్ళు? ప్రతి సవాళ్ళు ఏపీ లో పాలిటిక్స్.. ప్రకంపనలు రేపుతున్నాయి. సత్తెనపల్లిలో గ్రంథాలయ సంస్థ రాష్ట్ర మాజీ ఛైర్మన్, చిట్టా విజయభాస్కరరెడ్డి అంబటి కి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం పొలిటికల్ హీట్‌ని క్రియేట్ చేస్తోంది. మంత్రి అంబటి రాంబాబుపై స్థానిక ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వైసీపీ నేత చిట్టా విజయభాస్కర్‌రెడ్డి. సత్తెనపల్లిలో వైసీపీ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు చిట్టా. ఆరు నూరైనా?నూరు ఆరైనా?సత్తెనపల్లిలో తానే పోటీచేస్తానని తెగేసి చెప్పారు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి..ఇందుకోసం ఆయన స్థానిక నినాదం అందుకున్నారు. మరోవైపు ఏపీ టీడీపీలో లోకల్ నినాదం ఊపందుకుంది. మైలవరం టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. మైలవరంలో దేవినేని ఉమాకి షాకిచ్చారు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు.. పక్కనియోజకవర్గం వాళ్ళకోసం పాలేరుగా పనిచేసానంటూ అసమ్మతి రాగం ఆలపించారు బొమ్మసాని. దేవినేనిపై టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన వారికోసం ఇంతకాలం పాలేరులా పనిచేశానంటూ దేవినేని ఉమ పై పరోక్షంగా కామెంట్స్ చేశారు బొమ్మసాని. తాను స్థానికుడినైనా?ఆయన కోసం ఇన్నాళ్ళూ పనిచేశానన్నారు. ఈసారి మాత్రం నియోజకవర్గానికి సేవచేసే అవకాశం ఇవ్వాలంటూ చంద్రబాబుని బహిరంగంగా డిమాండ్ చేశారు బొమ్మసాని. ఇదే ఇప్పుడు టీడీపీలో ప్రకంపనలు రేపుతోంది. మైలవరం లో ఇప్పుడే కాదు.. టీడీపీ ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా సైతం ఇరు వర్గాలు వేర్వేరుగా సభలు నిర్వహించారు. చాలా కాలంగా మైలవరం వర్గ విభేదాలు టీడీపీలో కాకరేపుతున్నాయి?ఇక ఎన్నికలు సమీపిస్తోన్న వేళ?రాను రాను ఏం జరుగుతుందోనన్న ఆందోళన పార్టీ వర్గాలను కుదిపేస్తోంది.

## కాంగ్రెస్ పార్టీకి నులుకుర్తి రాజీనామా

### త్వరలో ఏ పార్టీలోకి వెళ్ళేది తెలియజేస్తా

కాకినాడ, ఏప్రిల్ 4 కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ సభ్యత్వానికి తాను రాజీనామా చేస్తున్నట్టు కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామానికి చెందిన నులుకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. తాను సుమారు 26ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో వివిధ స్థాయిలలో పనిచేస్తూ నేటితో ఆ పార్టీతో ఉన్న బంధంను తెంచుకుంటున్నట్లు ఆయన చెప్పారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కాకినాడలోని ఓ హోటల్లో తన రాజీనామాకు సంబంధించిన విషయాలను వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా నులుకుర్తి మాట్లాడుతూ 1998లో అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. అప్పటినుంచి తాను కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఉన్నత పదవులలో చేసినట్లు చెప్పారు. 2001లో కాకినాడ రూరల్, 2006లో పెదపూడి నుండి జడ్పిటిసిగా రెండు మార్లు గెలుపొందినట్లు చెప్పారు. అప్పుడు జిల్లా పరిషత్ చైర్మన్గా అవకాశం కొద్దిలో చేజారినట్లు తెలిపారు. 2009, 2019లో కాకినాడ రూరల్ అసెంబ్లీ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానని కొద్దిగ ఓట్ల తేడాతో ఓటమి చెందానన్నారు. అప్పటినుంచి పార్టీలో పని చేశానని రాష్ట్రంలో వైకాపా, టీడీపీ, జనసేన వంటి ప్రాంతీయ పార్టీల ప్రభావం వల్ల కాంగ్రెస్లో ఉండి తనను నమ్ముకున్న పార్టీకి, కార్యకర్తలకు ఎటువంటి పనులు చేయలేనని గ్రహించడం వల్ల తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు పంపించానని తెలిపారు. త్వరలోనే తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు.

# సోషల్ మీడియాలో ఎన్నికల వాతావరణం

## స్మార్ట్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న పొలిటికల్ పార్టీలు

విజయవాడ, ఏప్రిల్ 4, రాష్ట్రంలో ఎన్నికలకు మరో ఏడాదిపైనే టైమ్ ఉంది. చివరి ఏడాది ఎలాగూ ఎన్నికల హంగామా ఉంటుంది. ఇప్పటి నుంచే అన్ని రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. సోషల్ మీడియా వేదికగా పొలిటికల్ వార్‌కు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీలు సోషల్ మీడియాలో యుద్ధవాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. అటు ఫేస్‌బుక్, ఇటు ట్విట్టర్, మరోవైపు వాట్సాప్, ఇంకోవైపు యూట్యూబ్ ఇలా ప్రసార మాధ్యమాలలో ఒకరిపై ఒకరు విమర్శల దాడికి దిగుతున్నారు. యూత్‌ను ఆకట్టుకునేందుకు సినీడైలాగులతో కూడిన పొలిటికల్ పంచ్‌లు పేలుస్తున్నారు. ముఖ్యంగా చెప్పాలంటే సోషల్ మీడియా వేదికగా స్మార్ట్ క్యాంపెయిన్ నిర్వహించేస్తున్నారు. ప్రభుత్వ లొసుగులు, పొరపాట్లను టీడీపీ ప్రజల మైండ్‌లోకి ఇంజెక్ట్ చేస్తుంటే.. అటు వైసీపీ సైతం టీడీపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. మె?త్తానికి సోషల్ మీడియా వేదికగా పొలిటికల్ ఫైట్ నడుస్తోంది. పార్టీ అధినేతల దగ్గర నుంచి కార్యకర్తల వరకు చాలా మంది సోషల్ మీడియాను వేదికగా చేసుకుని తమ రాజకీయరంగానికి మరింత పదునుపెడుతున్నారు. జూమ్ మీటింగ్‌లు, టెలీ కాన్ఫరెన్స్‌లతో పార్టీ కార్యక్రమాలు నిర్వహించేస్తున్నారు. ట్విట్టర్ వేదికగా ఒక పొలిటికల్ యుద్ధమే నిర్వహిస్తున్నారు. ఇలా ప్రజల మధ్య తిరగకుండా సోషల్ మీడియా వేదికగా రాజకీయ చిచ్చురగుల్చుతూనే ఉన్నారు. మరోవైపు పార్టీ కార్యకర్తలు, అభిమానులు సైతం సోషల్ మీడియాలో విమర్శలు, ప్రతి విమర్శలతో షేక్ చేస్తున్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా నిత్యం సోషల్ మీడియాలో ఉంటూ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొందరైతే శృతి మించి విమర్శలు చేస్తూ జైలుపాలవుతున్న సంగతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చూసిన సంగతి తెలిసిందే. వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేనతోపాటు ఇతర పార్టీలు చేసే విమర్శలు ఇప్పుడు నెట్టింట తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో సోషల్ మీడియా ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఇన్విటేషన్‌లు, అభిప్రాయాలను పంచుకునేందుకు.. సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉపయోగపడే ఈ సోషల్ మీడియా ఇప్పుడు రాజకీయరంగాన్ని ఒక ఊపు ఊపుతోంది. ఫేస్ బుక్, ట్విట్టర్ వేదికగా ఒక పొలిటికల్ యుద్ధమే జరుగుతుంది. ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తాయి అప్పుడు జరిగే ఎన్నికల ప్రచారం తంతు అటు ఉంచితే సోషల్ మీడియాలో నిత్యం జరిగే పొలిటికల్ ట్విట్టర్ వార్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే పొలిటికల్ పార్టీల నడుమ సోషల్ సమరం పతాకస్థాయికి చేరుకుంది అనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఆయా పార్టీల అధ్యక్షుల దగ్గర నుంచి అభ్యర్థుల వరకు అంతా సోషల్ మీడియానే విరివిగా ఉపయోగిస్తున్నారు. ప్రతి నేత ఒక సోషల్ మీడియా టీంను ప్రత్యేకంగా నియమించుకుంటున్నారు. ఆ టీంతో చేసేది గోరంత పబ్లిసిటీ చేసుకునేది కొండంత అన్న చందంగా నేతలు తయారయ్యారు. రాష్ట్రంలో ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగించేవారి సంఖ్య నాలుగు కోట్లకుపైనే ఉందనేది వాస్తవం. ఈ నేపథ్యంలో యువతను ఆకట్టుకోవడమే ప్రధాన లక్ష్యంగా అన్ని పొలిటికల్ పార్టీలు సోషల్ మీడియాను అడ్డాగా మార్చుకున్నాయి. యువతను, అలాగే పార్టీ కార్యకర్తలు, అభిమానులను ఆకట్టుకునేందుకు చేసే పోస్టులు, ట్వీట్లు ఆద్యంతం ఆసక్తిరేపుతూనే ఉంటున్నాయి. ఇక కొంతమంది నాయకులు అయితే ఫేస్‌బుక్ లైవ్‌లోకి వచ్చి మరీ పొలిటికల్ రగడ సృష్టిస్తున్నారు. ఇంకాస్త ముందుకు వెళ్తే ఇప్పుడు అన్ని పార్టీలు వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసి ఏం చెప్పదలచుకుందో వాటిని సోషల్ మీడియా ప్లాట్ ఫాంపై వదిలేస్తోంది. దాన్ని అలా పార్టీ కార్యకర్తలు, అభిమానులు షేర్ చేస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. ఇక అసలు విషయానికి వస్తే వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ ద్వితీయశ్రేణి నాయకులు ఎవరికి వారుగా వారి పార్టీలకు చెందిన ప్రచారాల వీడియోలు, అనుకూల పోస్టులు పెడుతుంటే వాటికి వ్యతిరేకంగా ఇతర పార్టీల నాయకులు పోస్టులు పెడుతున్నారు. వాట్సాప్, ఫేస్ బుక్‌లలోనే ఒకరిపై ఒకరు విమర్శల దాడి చేసుకుంటున్నారు. కొందరైతే ఎదుటి పార్టీల నాయకులపై వ్యంగ్యంగా పోస్టులు పెడుతున్నారు. ప్రతీ చిన్న విషయాన్ని పెద్దదిగా చేసి ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపులో ముఖ్యభూమిక పోషించింది సోషల్ మీడియానే అనడంలో ఎలాంటి సందేహం లేదు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ చేసిన ప్రచారం ప్రతీ ఒక్కరి దగ్గరకు వెళ్లింది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే టీడీపీని సైతం బలంగా ఢీకొట్టింది. దీంతో వైసీపీ గెలుపు సునాయాసంగా మారిందని ఇప్పటికీ ఆ పార్టీ నేతలు చెప్తూ ఉంటారు. తమ వాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. ఓ వైపు వైసీపీ అధినేత జగన్ నియోజకవర్గాలను చుట్టేస్తుంటే.. మరోవైపు వైసీపీ సోషల్ మీడియా వింగ్ ప్రభుత్వ లొసుగులు, పొరపాట్లను ప్రజల మైండ్‌లోకి ఇంజెక్ట్ చేసింది. ముఖ్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాడు సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన 'రావాలి జగన్'.. సాంగ్ అందర్నీ పార్టీకి దగ్గర చేసింది. ముఖ్యంగా వైఎస్ జగన్ పొలిటికల్ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు చెందిన ఐప్యాక్ సంస్థ సోషల్ మీడియా ప్రచార నిర్వహణను పర్యవేక్షించేది. ప్రశాంత్ కిశోర్ తన అనుభవాన్ని రంగరిస్తూ సోషల్‌మీడియాలో ప్రచారాన్ని హోరెత్తించారు. చంద్రబాబు వైఫల్యాలను ఎండగడుతూ యువతను ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. అలాగే ఐప్యాక్ టీం వైసీపీకి సంబంధించిన స్లోగన్‌లను ఐటీ నిపుణుల ద్వారా.. సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. నిన్ను నమ్మం బాబు, బైబై బాబు, ఏపీ విత్ వైఎస్ఆర్‌సీపీ హ్యాష్ ట్యాగ్‌లతో ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో విస్తృత ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. 2014 ఎన్నికలప్పటి నుంచీ టీడీపీ సోషల్ మీడియాను బలంగా నమ్మింది. ఫేస్‌బుక్ ద్వారా పార్టీ కార్యక్రమాలను కార్యకర్తలు, అభిమానుల దగ్గరకు చేరవేసేది. ట్విట్టర్‌ను సైతం చంద్రబాబు, లోకేశ్‌తోపాటు స్టార్ కాంపైనర్లు ఉపయోగించేవారు. అంతేకాదు ఒక్కో వీడియో విడుదల చేసి సోషల్ మీడియాలో నేతలు హల్‌చల్ చేశారు. 2019 ఎన్నికల్లోనూ అదే ఒరవడిని టీడీపీ ప్రదర్శించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్‌లలో విపరీతమైన ప్రచారం చేసింది. సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురుతో ప్రత్యేకంగా యాడ్‌లను సైతం ప్రజల్లోకి వదిలారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులు మొదలైనవాటికి ప్రత్యేకంగా అకౌంట్లు ఓపెన్ చేసి ఊదరగొట్టారు. మంత్రులు, అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి సోషల్ మీడియాను అడ్డాగా మార్చుకున్నారు. అయితే ఐప్యాక్ టీంతోపాటు వైసీపీ సోషల్ మీడియా వింగ్ ఎదుట బొక్క బోర్లాపడ్డారు. దీంతో ఓటమి పాలయ్యారు. గత ఎన్నికల ఓటమిపై సమీక్షించిన చంద్రబాబు, నారా లోకేశ్‌లు వైసీపీ గెలుపులో సోషల్ మీడియా అత్యంత కీలకంగా మారిందని గ్రహించారు. 2019 ఎన్నికల అనంతరం చంద్రబాబు, లోకేశ్‌లు సోషల్ మీడియాను అవకాశం దొరికినప్పుడల్లా ఉపయోగించుకుంటున్నారు. ముఖ్యంగా చంద్రబాబు, లోకేశ్‌తోపాటు ఇతర నాయకుల పర్యటనలకు సంబంధించి, ప్రజల సమస్యలను వెంటనే ట్విట్టర్ లేదా ఫేస్ బుక్ లేదా యూట్యూబ్ వేదికల ద్వారా బహిరంగ పరుస్తున్నారు. టీడీపీ నేతలు ప్రెస్‌మీట్ పెడితే చాలు లైవ్ కూడా యూట్యూబ్ ద్వారా ఇచ్చేలా ఏర్పాటు చేశారు. పార్టీకి సంబంధించి వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ అకౌంట్లను క్రియేట్ చేసి పార్టీ విధానాలను, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు టీడీపీ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ యువతను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు చంద్రబాబు సైతం సోషల్ మీడియానే వేదికగా చేసుకుని పలు ప్రెస్‌మీట్‌లు నిర్వహిస్తున్నారు. జూమ్, టెలికాన్ఫరెన్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. 2024 ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికలంటే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జాతీయ స్థాయిలో కూడా సోషల్ మీడియా ప్రజలను ప్రభావితం చేస్తుందని గ్రహించిన పవన్ కల్యాణ్ అత్యధిక శాతం సోషల్ మీడియాలోనే ఉంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను తిప్పికొట్టేందుకు సోషల్ మీడియా వేదికగా నిరసనలకు పిలుపునిస్తున్నారు. జనసేన నిర్వహించిన రోడ్ల గుంతల ఉద్యమం సోషల్ మీడియాను షేక్ చేసిన సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ ఇచ్చిన పలు ఉపన్యాసాలు సూపర్ హిట్ అయ్యాయనే చెప్పాలి. అలాగే రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న ఘోరాలు, దారుణాలతోపాటు ప్రజా వ్యతిరేక విధానాలపై పవన్ కల్యాణ్ నిత్యం సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు. అటు అభిమానులు, పార్టీ కార్యకర్తలు సైతం సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకుని బాగా షేర్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు ఉన్న సినీ గ్లామర్‌ను క్యాష్ చేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా తమ పార్టీ అధినేతకు క్రేజ్ పెంచుతున్నారు.

## ఆందోళనకు సిద్ధమౌతున్న టీడీపీ

విజయవాడ, ఏప్రిల్ 4,పోలవరం నిర్మాణ పనుల్లో ఎక్కడా పురోగతి లేదని, హెడ్ వర్క్స్ లెఫ్ట్ కెనాల్, రైట్ కెనాల్ ఎక్కడా పనులు ముందుకు వెళ్లలేదని మాజీ ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమా విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను నట్టేట ముంచారని, రైట్ కెనాల్ మీద ఇంకో లిఫ్టు పెట్టి పోలవరం డ్యామ్ కాస్త పోలవరం బ్యారేజ్‌గా చేసి, ప్రాజెక్టును రిజర్వాయర్‌గా 41.15 మీటర్లు లేకుంటే 135 అడుగుల ఎత్తుకు పరిమితం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి రెండేళ్లు అయినా, ఇంతవరకు డిజైన్లు ఫైనల్ అవ్వలేదని డిడిఆర్పీ, ఐఐటి హైదరాబాద్, సెంట్రల్ వాటర్ కమిషన్ వీళ్ళందరూ వచ్చి చెప్పేవరకు ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో చెప్పలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత మంత్రులు ఉన్నారని, ముఖ్యమంత్రి పోలవరం గురించి మాట్లాడటమే మానేశాడని, జగన్ ఎన్ని సార్లు ప్రధానమంత్రిని ఆర్థిక మంత్రిని సంబంధిత జలవనరుల శాఖ మంత్రిని కలిసి ఏమి విజ్ఞప్తి చేశారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు కావడంతో ప్రతి రూపాయి కూడా కేంద్రం నుంచి తెచ్చుకునే అవకాశం ఉందని, చంద్రబాబు నాయుడు నాబార్డ్ క్రింద ఖర్చు పెట్టిన డబ్బులు 13500 కోట్లు వచ్చాయని, ఆ డబ్బులన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన డబ్బు దేనికి ఖర్చు పెట్టారని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 6వేల కోట్లు వచ్చాయని, నిర్వాసితులకు ఇళ్లు కట్టారా, డామ్ సైట్లో పనులకు కట్టారా లేదా లిక్కర్ కంపెనీలకు అడ్వాన్సులు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఏపీలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుని నాశనం చేసి, అమరావతిని చంపేశారని ఆరోపించారు. నిర్వాసితులకు ఇస్తానన్న పది లక్షలు ఇవ్వలేదని, ఐదు లక్షలు ఇవ్వలేదని, రూ.500 కోట్లు ఇస్తామని జీవోలో చెప్పినా డబ్బులు వాళ్లకు వెళ్లలేదని ఆరోపించారు. అన్ని విధాలుగా పోలవరం ప్రాజెక్టుని ముంచేసిన జగన్ చరిత్రలో పోలవరం ద్రోహిగా మిగిలిపోతాడన్నారు. ప్రాజెక్టులో ఏ పనులు కూడా ముందుకు వెళ్లడం లేదని, సంవత్సరానికి మూడు పర్సంటేజీ పనులు చేయలేని అసమర్ధ ప్రభుత్వం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుని పూర్తి చేస్తుందా అని ప్రశ్నించారు. సిఎంగా జగన్మోహన్ రెడ్డి ఇంకా ఎన్ని నెలలు నువ్వు అధికారంలో ఉంటారన్నారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది కాంగ్రెస్ ప్రభుత్వంలో అంజయ్య గారనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. పోలవరం మల్టీపర్పస్ ఇరిగేషన్ హైడ్రో పవర్ ప్రాజెక్టును నాశనం చేసి చరిత్రహీనుడిగా జగన్మోహన్ రెడ్డి మిగిలిపోయారని దేవినేని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అక్రమ మైనింగ్ పై విజిలెన్స్ దాడులు

విజయవాడ విజయవాడ రూరల్ మండలంలో అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో విజిలెన్స్ దాడులు మంగళవారం కుడా కొనసాగాయి. విజయవాడ రూరల్ మండలం పరిధిలో పోలవరం కేనాల్, వేమవరం, కొత్తూరు తాడేపల్లి, పి నైనవరం పరిధిలో విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేసారు. కొందరు వ్యక్తులు ఇటీవల అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోవాలని హైకోర్టును ఆశ్రయించి ఎన్జీటిలో పిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సోమవారం అర్ధరాత్రి సమయంలో దాడులు చేసి మైనింగ్ చేస్తున్న వాహనాలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేసారు.

## టీడీపీ, వైకాపా వాగ్యుద్ధం

గుంటూరు గుంటూరు నగరంలో టీడీపీ, వైసీపీ నేతల వాగ్యుద్ధం చేలరేగింది. సవాళ్లు ప్రతి సవాళ్ళను విసురుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. అంజుమాన్ సంస్థ ఆస్తుల అక్రమాలపై చర్చలకు రావాలని టీడీపీ అధికార ప్రతినిధి నజీర్ మహమ్మద్ సవాల్ విసిరారు. దానికి వైకాపా ఎమ్మెల్యే ముస్తఫా సవాల్ ను స్వీకరించారు. బీ ఆర్ స్టేడియం ఎదురు అంజుమాన్ షాదీఖాన వద్దకు రావాలని ముస్లిం నేతల పిలుపునిచ్చారు. ఈ నేపధ్యంలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు.

## శ్రీ సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు సమర్పణ

బద్వేలు ఒంటిమిట్టలో బుధవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను మంగళవారం సమర్పించారు. మొత్తం 180 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద డెప్యూటీ ఈవో నటేష్ బాబు, అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో అందించారు. ఈ తలంబ్రాల కోసం ఆరు నెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి నాలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిభావంతో మూడు నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా భద్రాద్రి రామునికి, ఆరేళ్లుగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని కళ్యాణ అప్పారావు తెలిపారు.

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

నారాయణపేట ఏప్రిల్ 04 నారాయణపేట జిల్లాలో పదవ తరగతి పరీక్షల సందర్భంగా మంగళవారం ఉదయం జిల్లా ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు శ్రీ సాయి హైస్కూల్ మరియు జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్ హై స్కూల్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు సిబ్బందిని పరీక్షలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకొని వారికి భద్రత పరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు పారదర్శకంగా జరిగేలా ఏటువంటి అవకతవకలకు తావు లేకుండా బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పరీక్షల నియమాల ప్రకారం పరీక్ష కేంద్రాల దగ్గర పక్కాగా బందోబస్తు ఏర్పాటు చేయడమైనది అని జిల్లా లోనీ మొత్తం 38 పదవ తరగతి పరీక్ష కేంద్రాల దగ్గర కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడమైనది క్వశ్చన్ పేపర్ పరీక్ష కేంద్రాలకు వెళ్లే సమయంలో పూర్తి ఎస్కార్ట్ తో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పరీక్ష కేంద్రాలలోనికి ఎగ్జామ్స్ సూపరెండెంట్స్, ఇన్విజిలేటర్లు, ఉపాధ్యాయులు ఎవరికి సెల్ ఫోన్లు అనుమతి లేదని పరీక్ష కేంద్రాలలోకి వెళ్లే ముందు పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే పంపించడం జరుగుతుందని సీసీ కెమెరాల నిఘా నీడలో ప్రశాంతంగా జరుగుతున్నాయని ప్రజలు విద్యార్థులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ తో పాటు ఎస్బి సిఐ రమ్ లాల్, సిఐ రవి బాబు, ఆర్ ఐ కృష్ణయ్య, ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంట పరుగులు... అయ్యన్న సైలెంట్



విశాఖపట్టణం, ఏప్రిల్ 4 ,మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు టీడీపీలో మళ్లీ పట్టు చిక్కింది. ఆయన తిరిగి పార్టీలో చక్రం తిప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా గంటా శ్రీనివాసరావు పార్టీలో యాక్టివ్‌గా ఉన్నారు. నాలుగేళ్ల నుంచి పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ సమావేశాలకు కూడా హాజరు కావడం లేదు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అంశంపై ఆయన రాజీనామా చేయడంతో తాను అసెంబ్లీకి రావడం లేదని సన్నిహితులు వద్ద చెబుతున్నారు. మరో వైపు నియోజకవర్గంలోనూ పెద్దగా యాక్టివ్ గా లేరు. దీంతో అయ్యన్న వర్గం విశాఖ జిల్లాలో ఇక తమకు తిరుగులేదని భావించింది. కానీ తిరిగి గంటా యాక్టివ్ కావడం, చంద్రబాబు అండ్ కో గంటాను దగ్గర తీయడంతో అయ్యన్న టీం సైలెంట్ అయింది.. వైసీపీలోకి వెళ్లాలని భావించినా అక్కడ అవంతి శ్రీనివాసరావు అడ్డుపడటంతో చేరిక ఆగిపోయిందనే విమర్శలు కూడా లేకపోలేదు. ఆ సంగతి అలా ఉంచితే... ఎన్నికలు దగ్గర పడే సమయంలో గంటా శ్రీనివాసరావు మరోసారి యాక్టివ్ అయ్యారు. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. నాలుగేళ్లుగా పార్టీకి దూరంగా ఉంటున్న ఆయనకు టీడీపీలో పెద్దగా ప్రాధాన్యత ఉండకపోవచ్చని ఆయన ప్రత్యర్థులు భావించారు. ఉత్తరాంధ్రకు వెళ్లేందుకు విమానాశ్రయానికి వెళ్లిన చంద్రబాబు సయితం గంటాతో ముభావంగా వ్యవహరించడం అప్పట్లో హాట్ టాపిక్ అయింది. దీంతో టీడీపీలో గంటా శ్రీనివాసరావు పని అయిపోయిందని అనుకున్నారు. పార్టీలో ఆయన ప్రధాన ప్రత్యర్థి అయ్యన్నపాత్రుడు కూడా ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడం పట్ల సంతృప్తికరంగా లేరు. అయితే కాపు సామాజికవర్గానికి చెందిన బలమైన నేత కావడం, చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు మాజీ మంత్రి నారాయణకు వియ్యంకుడు కావడం, ఉత్తరాంధ్రలో బలమైన నేతగా భావించి గంటా శ్రీనివాసరావుకు తిరిగి ప్రాధాన్యత లభించడం ఖాయంగా కనిపిస్తుంది. దీంతో పాటు ఇటీవల జరిగిన గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా ఆయనను చంద్రబాబుకు మరింత చేరువ చేశాయంటున్నారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తొలుత ఒక మహిళను చంద్రబాబు ఎంపిక చేశారు. అయితే చివరి నిమిషంలో ఆమెను మార్చి చిరంజీవి రావు పేరును సూచించింది గంటా శ్రీనివాసరావు అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాను గెలిపించుకువస్తానని కూడా చంద్రబాబుకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. అందుకే గంటా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యాక్టివ్ అయ్యారు. పోలింగ్, కౌంటింగ్ జరిగే టప్పుడు కూడా అక్కడకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. తాను చెప్పిన వ్యక్తికే టిక్కెట్ ఇవ్వడం, ఆయన గెలవడంతో చంద్రబాబుకు గంటా శ్రీనివాసరావు మీద నమ్మకం మరింత పెరిగిందంటున్నారు. తాజాగా అనంతపురం జిల్లాకు వెళ్లి నారా లోకేష్ నుకూడా పాదయాత్రలో కలసి కొంతదూరం నడిచి వచ్చారు. ఆయన నుంచి కూడా హామీ పొందారని తెలిసింది. తేడా జరిగితే చిరంజీవి రావును కూడా తనతో వేరే పార్టీలోకి తీసుకెళ్లే అవకాశముండటంతో గంటాకు టీడీపీలో ఎలాంటి ఇబ్బందులు లేనట్లేనన్న కామెంట్స్ వినపడుతున్నాయి. గంటాకు ప్రయారిటీ ఉండదని భావించిన వారి ఆశలు అడియాసలేనని చెప్పక తప్పదు.

## కావలిలో వైసీపీ కీలక నేత మన్నెమాల సుకుమార్ రెడ్డి ని సస్పెండ్

నెల్లూరు ఏప్రిల్ 4 వైసీపీ లో సస్పెన్షన్ ల పర్వం కొనసాగుతూనే ఉంది. కావలిలో వైసీపీ కీలక నేత మన్నెమాల సుకుమార్ రెడ్డి ని సస్పెండ్ చేస్తూ అధిష్టానం లేఖ ను విడుదల చేసింది. ఇటీవల తనపై రాజకీయ కుట్రలు చేస్తున్నారని అధిష్టానం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇటీవల కాలం వరకు సుకుమార్ రెడ్డి కావలిలో అంతా తానై వ్యవహరించారు. కొన్ని విషయాల్లో ఎమ్మెల్యేను ప్రశ్నించడం, ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండడం.. ఆర్థిక లావాదేవీల్లో గొడవల కారణంగా చర్చలు సాగుతున్నాయి. వరుస సస్పెన్షన్‌లతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. నెల్లూరు జిల్లాలో ఇటీవల ముగ్గురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యే ఓటు వేయలేదనే కారణంగా ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి లను పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఇది జరిగి నెల రోజులు కాకముందే కావలిలో కీలకంగా వ్యవహరించే సుకుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ అధిష్టానం లేఖ విడుదల చేసింది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందునే సస్పెండ్ చేస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. సుకుమార్ రెడ్డి కావలిలో అంతా తానై వ్యవహరించారు. ఇక్కడ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డా? లేక సుకుమార్ రెడ్డా? అనే అనుమానాలు వచ్చే విధంగా ఈయన ఒక షాడో ఎమ్మెల్యేలా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, సుకుమార్ రెడ్డిల మధ్య విభేధాలు తారస్థాయికి చేరాయి. దీంతో అధిష్టానం సుకుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో వైసీపీ శ్రేణులు అయోమయానికి గురయ్యారు.

## ఉత్తరాంధ్ర సదస్సుతో వైసిపిలో వణుకు

### జగన్ పాలన రాష్ట్రానికి శాపం
### చంద్రబాబు రాకతో పార్టీలో నూతనోత్తేజం

విశాఖపట్నం,ఏప్రిల్4 :తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర స్థాయి సదస్సును ఈనెల ఐదో తేదీన పీఎంపాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. సదస్సుకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఆ రోజు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సు జరుగుతుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 34 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలతో పాటు, సెగ్మెంట్ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు సుమారు ఐదు వేల మంది సదస్సుకు హాజరుకానున్నారు. ఉత్తరాంధ్రలో సంస్థాగతంగా పార్టీ పరిస్థితి, నాయకుల మధ్య సమన్వయం, ప్రధానంగా క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో కలిసి పనిచేస్తున్న విధానం, ప్రభుత్వ వైఫల్యాలు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై ఉమ్మడి విశాఖ జిల్లా నేతలతో నగరంలోని పార్టీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించినట్లు విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వీధివీధిన సిమెంటు రోడ్లు టీడీపీ హయాంలోనే నిర్మాణం జరిగినట్టు చెప్పారు. ప్రస్తుత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిపోయిందని, వచ్చే ఏడాది జగన్ జైలుకేనని స్పష్టం చేశారు. ప్రజా ధనాన్ని దోపిడీ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులకు నట్టేట ముంచిందని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 33వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులకు ఆశ చూపించి, నట్టేట ముంచేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులు సంఖ్య 11 లక్షలకు చేరుకున్నారన్నారు. వైసీపీ హయాంలో ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని విసిగి వేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ లేక.. రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక నిరుద్యోగుల భవిత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో మూడేళ్లలో 21,571 మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చెప్పినా జగన్‌రెడ్డికి చీమకుట్టినట్టుగా లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ప్రమాదకర స్థాయిలో నిరుద్యోగం పెరిగిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉందని, యువత మంచి మార్గంలో నడవాలి అంటే ఉపాధి అవకాశాలు ఉండాలని అన్నారు. జగన్ తన పాదయాత్రలో జాబ్ క్యాలెండర్ అంటూ వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయమై కూడా ప్రస్తుతం ఆయన మాట్లాడడం లేదని వివరించారు. వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రంలో పరిశ్రమలు తరలివెళ్లిపోతున్నాయని ఆయన తెలిపారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 13 లక్షల ఉద్యోగాలు కల్పించామని ఆయన వివరించారు.

## స్వర్గీయ కిడారి సర్వేశ్వరరావు 51వ జయంతి

అల్లూరి సీతారామరాజుఅరకులోయ మండల కేంద్రంలోని అక్షయిన్ కన్వెన్షన్ హాల్లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబు రావు ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గ ఇన్చార్జి కిడారి శ్రావణ్ కుమార్ మండల పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, దివంగత నేత మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు 51 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు అనంత ఆయన చిత్రపటాన్ని నమస్కరించి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నిరంతరం పార్టీ కోసం ప్రజా శ్రేయస్సు కోసమే పనిచేసారని గుర్తు చేశారు గిరిజన ప్రాంతాన్ని ఒక సంక్షేమ అభివృద్ధి బాటలో నడిపించిన మహా నేత అని కొనియాడారు ఆయన చేసిన సేవలను గుర్తించి ఇప్పటికీ గిరిజన ప్రజలు గుండె లో ఆయన జ్ఞాపకాలను పదిల పరచుకున్నారన్నారు ఎప్పుడూ ప్రజలతో మమేకమై ఉండేవారని ఒక సామాజిక వర్గానికి చెందిన నేత మాత్రమే కాదని బడుగు బలహీన వర్గాల వెన్నంటి నిలిచినా వారికి అండగా నిలిచారన్నారు పేదల పెన్నిధి గా కిడారి సర్వేశ్వరరావు అందరి వాడని తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కిల్లో సాయిరాం, అసెంబ్లీ లీగల్ సెల్ అధ్యక్షులు రత్నం రాజు,కిల్లో శ్యాం యూత్ నాయకులు, రమేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్లు పంపిణీ






నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్) ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా జమాఅతె ఇస్లామి హింద్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ నేపధ్యంలో రెండవ విడత పంపిణీ చేసారు. స్థానిక గోల్డెన్ బేకరిలో 10 కిలో బియ్యం, కంది బ్యాలు , మంచి నూనె, కారం తదితర వెయ్యి రూపాయల విలువగల ఆహార నిత్యావసర వస్తువుల గల కిట్లు జిల్లా ఆర్గనైజర్ జనాబ్ సి.యంజకరియా ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేసారు. స్థానిక అధ్యక్షులు అబ్దుల్ సమద్ అధ్యక్షతన నిర్వహించిన కిట్ల పంపిణీ లో సమద్ మాట్లాడుతూ దాతల నుండి అందిన సహకారంతో పేదలను గుర్తించి కిట్లు ఇస్తున్నట్లు తెలిపారు . సి.యం.జకరియా మాట్లాడుతూ , సహనంతో ఓర్పుతో రంజాన్ మాసంలో ముస్లింలు ఉంటారని, పేద ప్రజలను శక్తికొద్ది ఆదుకోవాలని ఆరాటం పడుతారని అందుకే ఇలాంటి కార్యక్రమాలకు దాతలు ముందుకు వస్తారన్నారు. అనంతరం పేదలకు కిట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఖిద్మత్ ముహమ్మద్ ఫయాజ్, ముహమ్మద్ యూనూస్, పి.వి.అఫ్రోజ్, మస్లిహుజ్జమా తదితరులు పాల్గొన్నారు.

## న్యాఫ్ యువజన విభాగం జాతీయ అధ్యక్షులుగ తెలుగు అనిల్

కుమార్కర్నూల్ ప్రతినిధి. విభారె న్యూస్జాతీయ మత్స్యకారుల సంఘము (న్యాఫ్ )యువజన విభాగం జాతీయ అధ్యక్షులుగ కర్నూలు నగరానికి చెందిన తెలుగు అనిల్ కుమార్ ను నియమించారు ఈయన గత కొన్ని సంవత్సరాలనుండి మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమము కోసం చేస్తున్న



కృషిని గుర్తించి న్యాఫ్ జాతీయ కమిటి, జాతీయ మత్స్యకారుల సంఘము యువజన విభాగం జాతీయ అధ్యక్షులుగ నియమించారుఅనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవన ఉపాధి మెరుగుపరిచేందుకు అలాగే గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషిచేస్తానని మత్స్యకారుల సమస్యలతో పాటు వారి సంక్షేమ సమస్యలు పరిష్కరిస్తామన్నారు...నాపై నమ్మకంతో నన్ను ఈ పదవిలో నియమించిన పెద్దలు న్యాఫ్ జాతీయ చైర్మన్ శ్రీ సభాపతి గారికి (కర్ణాటక )వర్కింగ్ చైర్మన్ శ్రీ ప్రభాకరన్ గారికి (తమిళనాడు )జాతీయ సెక్రటరీ జనరల్ శ్రీ అనంత నగేష్ బాబు గారికి(ఏపీ )రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోస అప్పలరాజు గారికి మత్స్యకార నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు....

## భూమా పుట్టిన రోజు సందర్భంగా ప్లాస్టిక్ కవర్లు పంపిణీ.

నంద్యాల మా ప్రతినిధి (విభారె) :– నంద్యాల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి జన్మదిన సందర్భంగా నంద్యాల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ కవర్లను పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో తక్కువ మైక్రాన్లతో తయారైన కవర్లను నంద్యాల లోని గాంధీ చౌక్ సెంటర్,బస్టాండ్ దగ్గర చిన్నచిన్న వ్యాపారస్తులకు మరియు ప్రజలకు అందజేశారు. అనంతరం స్వీట్లు పంచారు . ఈకార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, టిడిపి ఫ్లోర్ లీడర్ మహబూబ్ వలి , కౌన్సిలర్స్ నాగార్జున , పట్టణ వైస్ ప్రెసిడెంట్ ఆయుబ్ బాషా, ఉప్పరి సురేష్ కుమార్, నంద్యాల అసెంబ్లీ యువత అధ్యక్షులు మందాల అవినాష్ రెడ్డి , ముద్దుని నాగ నవీన్, నంద్యాల యూత్ లీడర్ గుల్లి, బాషా, బుజ్జి.బాలు ,కైలాష్,హరిబాబా, మధు, నాయుడు ,చెన్నయ్య నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాయలసీమ సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి



### .ఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహించిన రాయలసీమ సంఘాలు.
### రవికుమార్,రాష్ట్ర అధ్యక్షులు, ఆర్వీపీఎస్.

కర్నూలు:– రాయలసీమ సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరుతూ రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్,రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న,రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లారెడ్డి,కర్నూలు జిల్లా అధ్యక్షులు అశోక్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాష్ట్ర రాజధాని ఏర్పాటు చేయాలని 1953నుంచి 1956 వరకు రాయలసీమలో కొనసాగిందని తిరిగి అదే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన ప్రస్తుత పరిస్థితులలో రాజధానిని రాయలసీమలో ఏర్పాటు చేయకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అలాగే కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని అప్పర్ భద్ర ప్రాజెక్టువల్ల రాయలసీమ ఎడారిగా మారుతుందని తెలిసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్లైనా లేకపోవడం విడ్డూరంగా ఉందని అలాగే సంగమేశ్వరం వద్ద కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి స్థానంలో బ్రిడ్జి కం బ్యారేజ్ ను నిర్మించాలని రాయలసీమలోని పెండింగులో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని గుండ్రేవుల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కురువ మద్దిలేటి,ఎర్రకోట మల్లప్ప, వెల్దుర్తి ఎల్లరాముడు,జయరాముడు,గణేష్,రాముడు తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు



### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు యం సుధాకర్ బాబు
### డిసిసి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా..



కర్నూల్ ప్రతినిధి... విభారేన్యూస్జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలో మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాలని పాత్రికేయులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని డిసిసి అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం జగన్నాథ గట్టుపై ఉన్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ స్థలంలో జరుగుతున్న మట్టి మాఫియా ఆగడాల వల్ల పాత్రికేయులకు కలిగిన నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏదైనా ఏ వర్గానికైనా ఏ కులానికి ఓ మతానికి అన్యాయం జరిగితే పాత్రికేయులకు విన్నవించుకుంటారని వారికే సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హౌసింగ్ సొసైటీ సభ్యులకు న్యాయం జరగాలని, మాఫియాను నియంత్రించడంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సంబంధిత మైనింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు పాత్రికేయుల సంక్షేమం కోసం స్థలం కేటాయించడం జరిగిందని, పాత్రికేయులకు వారికున్న ఆర్థిక పరిస్థితుల వల్ల సకాలంలో ఇల్లు నిర్మించుకోలేక పోయారని, అదేవిధంగా రహదారులు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ పాత్రికేయులకు కేటాయించిన స్థలంలో మట్టి మాఫియా దున్నుకొని, కొండలు సైతం మట్టి తీసుకొని పోవడం శోచనీయమన్నారు. ఆ గుంతలను మాఫియా వారితోనే పూడ్చాలని ఆయన కోరారు . దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు తూట్లు పొడిస్తే సహించేది లేదన్నారు. త్వరలో మైనింగ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్ట బోతున్నామన్నారు. అన్ని విభాగాల వారు అన్ని రాజకీయ పార్టీలు ఏకమై పాత్రికేయులకు న్యాయం జరగాలని వారి స్థలంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ఇల్లు నిర్మించుకునేలా ప్రభుత్వం జిల్లా యంత్రాంగం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతకన్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి బజారన్న కర్నూల్ నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

# రూ.380 కోట్లకు పెరిగిన అంబేద్కర్ స్మృతివనం నిర్మాణ వ్యయం

### జూలై నాటికి పూర్తి కానున్న విగ్రహా నిర్మాణం
### మంత్రి మేరుగు నాగార్జున వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 4: బీఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్మాణ వ్యయం రూ.268 కోట్ల నుంచి రూ.380 కోట్లకు చేరిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, అంబేద్కర్ నిర్మాణ కమిటీ ఛైర్మెన్ మేరుగు నాగార్జున వెల్లడించారు. నిర్మాణ వ్యయం ఎంతగా పెరిగినా నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా జరుగుతున్న స్మృతివనం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను జూలై నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున అంబేద్కర్ స్మృతివనం పనులను సమీక్షించారు. ఈ సందర్భంగానే నాగార్జున మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడో మారుమూలన రూ.100 కోట్ల వ్యయంతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని చెప్పారు. అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడ లో వేల కోట్ల రుపాయల విలువైన పీడబ్ల్యుడీ గ్రౌండ్స్ భూములను అంబేద్కర్ స్మృతివనం నిర్మాణానికి కేటాయించడంతో పాటుగా రూ.268 కోట్ల ను మంజూరు చేసారని తెలిపారు. అయితే స్మృతివనం లో చిరస్థాయిగా నిలిచిపోయేలా మరికొన్ని భవనాలను నిర్మించాలని, స్మృతివనం ప్రాంగణాన్ని అత్యాధునిక పద్ధతుల్లో సుందరీకరించాలని నిర్ణయించడంతో అదనంగా మరో రూ.106 కోట్లను మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇది కాకుండా పురపాలక శాఖ కూడా మరో రూ.6 కోట్లను స్మృతివనం పనులకు మంజూరు చేసిందని ఈ లెక్కన ప్రస్తుతం అంబేద్కర్ స్మృతివనం నిర్మాణ వ్యయం రూ.380 కోట్లకు చేరిందని వివరించారు. విగ్రహావిష్కరణ పూర్తయ్యే సమయానికి అంచనా వ్యయం రూ.400 కోట్ల్లు దాటే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే నిర్మాణ వ్యయం ఎంతగా పెరిగినా స్మృతివనం పనులు చరిత్రలో మిగిలిపోయేలా చేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశించడంతో దేశంలో మరెక్కడా లేని విధంగా ఈపనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణం హరియాణలో జరుగుతుండగా దానికి సమాంతరంగా పీడబ్ల్యుడీ గ్రౌండ్స్ లో స్మృతివనం పనులు రాత్రీ పగలూ జరుగుతున్నాయని జరుగుతున్నాయన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నాటికి స్మృతివనం పనులను పూర్తి చేయాలనుకున్నా అనివార్యకారణాలతో జూలై నాటికి స్మృతివనం పనులను పూర్తి చేసి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని నాగార్జున తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, సందర్శకులకు ఒక మంచి అనుభూతిని కలిగించే విధంగా అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన అంశాలను ప్రదర్శించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్మృతివనంలో భాగంగా నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ నిర్మాణపనులను వేగవంతం చేయాలని, మరింత ఎక్కువ మంది కార్మికులను ఈ పనుల్లో వినియోగించాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహ శిల్పి నరేష్ విగ్రహ నిర్మాణపనుల పురోగతిని వివరించారు. ఏపీఐఐసి అధికారులు స్మృతివనం పనుల ప్రగతిని పీపీటీ ద్వారా ప్రదర్శించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ కే.హర్షవర్ధన్, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నూపుర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్, ఏపీఐఐసి సిఇ నరసింహారావు, కేపీసీ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి అభివృద్ధిపై స్మార్ట్ సిటీ బోర్డ్ సమావేశం

తిరుపతి, తిరుపతి అభివృద్ధికై చేపట్టిన స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ పనుల వివరాలను తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై డైరెక్టర్లతో ప్రత్యక్షంగాను, జూమ్ మీటింగు ద్వారా మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిలో జరుగుతున్న ప్రాజెక్టుల వివరాలను అనుపమ వివరించారు. ముఖ్యంగా శ్రీనివాససేతు మూడవ దశ పనుల గురించి వివరిస్తూ జూన్ కంతా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. తిరుపతి నగరం విస్తరిస్తూ జనభా పెరగడంతో వాహనదారులకు అవసరమైన చోట్ల ఫ్రి లెఫ్ట్ లు నిర్మించేందుకు కృషి చేయాల్సిన అవసరముందని తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కాలపరిమితి పూర్తి అవుతున్నందున, స్మార్ట్ సిటీ పూర్తి చేసిన ఆస్తులన్నింటిని నిర్వహణ కోసం తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కు అప్పగిస్తూ బోర్డ్ తీర్మానం చేయడం జరిగింది. ఈ సమావేశంలో జూమ్ ద్వారా స్మార్ట్ సిటీ డైరెక్టర్స్ తిరుపతి జిల్లా పోలీస్ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, టిటిడి జెఈఓ సదాభార్గవి, డిల్లీ నుండి అండర్ సెక్రటరీ విజయకుమార్, తుడా వీసి హరికృష్ణ, ఇండిపెండెంట్ డైరెక్టర్స్ రామచంద్రా రెడ్డి, డాక్టర్ రమాశ్రీ, జి.ఎం చంద్రమౌళీ, ఎస్.ఈ తిరుమాలిక మోహన్, ఎంఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పోలీసులపై తెగబడ్డ ఎర్ర దొంగలు

నెల్లూరునెల్లూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు దారుణానికి తెగబడ్డారు. అడ్డువచ్చిన పోలీసుల్ని పోలీసులు వాహనాలను ఢీ కొట్టిన వైనం ఇది. ఘటనలో ఎస్సై, పోలీసులకు గాయాలు అయ్యాయి.రాపూరు అడవుల నుండి కారులో ఎర్రచందనం డక్కిలి మీదుగా కారులో తరలిస్తున్నారని ఆ కారును అడ్డుకోవాలని డక్కిలి ఎస్ఐకి రాపూరు ఎస్సై సమాచారం ఇచ్చారు. దాంతో డక్కిలి పోలీసులు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న కారును అడ్డుకున్నారు. అయితే, కారు ను స్మగ్లర్లు ఆపకుడా ఎస్సై పోలీస్ సిబ్బందిపై పోనిచ్చారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

---- ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో డిఆర్ఓకు వినతిపత్రం



నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్) జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఎపియుడబ్లుజె ఆధ్వర్యంలో మంగళవారం డిఆర్ఓ పుల్లయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఏపీయుడబ్లుజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎపియుడబ్లుజె నంద్యాల జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు శ్యాంసుందర్ లాల్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులు జనార్ధనరెడ్డి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చలంబాబు, మధు, ఉస్మాన్ భాష తదితరులు పాల్గొని మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడేషన్ లు వెంటనే మంజూరు చేయాలని, బస్ పాస్ లు ఇవ్వాలని, కమిటీల్లో యూనియన్స్ కు ప్రాతినిధ్యం కల్పించాలని, మండలంలో 100 పత్రికలు అనే నిబధన తొలగించాలని,కొత్త జీఓలో అసంబద్ధ నిబంధనలు తొలగించాలని, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలని తదితర డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళే జర్నలిస్టులకు ఇంటి స్థలాలిచ్చి ఇల్లు నిర్మాణం చేపట్టి ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో వారికి 10,000, న్యాయవాదులకు 5000 ఇస్తున్నప్పుడు జర్నలిస్టులకు కూడా నెలకు 15000 రూపాయలు ఇవ్వాలని పేర్కొన్నారు. లేని ఎడల రాష్ట వ్యాప్త ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నంద్యాల పట్టణ పాత్రికేయులు విజయ్, మహేష్, బాలు నాయక్, వైఫై భాష, కుమార్, నూర్ బాష,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పక్షపాతి జగనన్న




నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్) : ప్రభుత్వం అందించే మహిళా సంక్షేమంతోనే , ఆర్థికాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ,ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డిలు అన్నారు మంగళవారం ముందుగా గ్రమైక్య ఐక్య సంఘం సభ్యుల సహకారంతో దాదాపు రూ.40 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన చేయూత మహిళ మార్ట్ను ప్రారంభించి,అంతరం నిత్యావసర సరుకుల ధరలను పరిశీలించి,ప్రజలకు సరసమైన ధరలతో విక్రయించి,అన్ని సరుకులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళా మార్ట్ సభ్యులను ఆదేశించారు.అనంతరం సాయిబాబా కళ్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా 3 వ విడత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడరు.మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నదే జగన్నన్న సంకల్పమని, మండలంలోని 1352 గ్రూపులలోని 13186 మంది లబ్ధిదారులకు రూ.8.30 కోట్ల రూపాయల చెక్కును అందజేశారు,మహిళలు ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమాలలో నగరపంచాయితీ చైర్మన్ చలం రెడ్డి, ఆర్డీవో వెంకట రెడ్డి, తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, పీఏ లు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి,పిడి శ్రీధర్ రెడ్డి,ఏపీఎం లింగమయ్య గౌడ్,మెప్మా పిడి శివ లీల,గోరుమాను కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు,వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకుడు బాబుల్ రెడ్డి, దస్తగిరి, మురళి కృష్ణ,ఆర్ఐ శ్రీదేవి,జిల్లా మహిళా మార్ట్ ప్రతినిధి శ్రీనివాస్,సీసీలు, విఓఏలు,అధిక సంఖ్యలో మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ఆదుకోవాలి

### జాతీయ చేనేత ఐక్యవేదిక సంగం డిమాండ్

బద్వేలు కరోనా కారణంగా కుదేలైన చేనేత పరిశ్రమకు రాయితీలు కల్పించి, చేనేత కార్మికులను ఆదుకోవాలని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ,రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుసింగప్ప లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, వారు మంగళవారం చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో ని 10 గ్రామాలలో పర్యటించి చేనేత కార్మికుల స్థితిగతులను, సాధక బాధకాలను తెలుసుకున్నారు. చేనేత కార్మికులను పరామర్శించి చేనేత వృత్తిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు .వారి దృష్టికి వచ్చిన చేనేత సమస్యలపై బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, మంగళగిరిలోని చేనేత మరియు జోలి శాఖ కమిషనర్ నాయక్ లను కలిసి వినతి పత్రం అందజేసి చేనేత పరిశ్రమను ,కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.చేనేత కార్మికులకు రుణమాఫీ చేయడంతో పాటు 11 రకాల చేనేత వస్త్రాలపై రిజర్వేషన్ యాక్టు నుకఠినంగా అమలు చేయాలని ,పవర్ లూమ్స్ పై చేనేత వస్త్రాల తయారీని అడ్డుకట్ట వేసి ఎన్ఫోర్స్మెంట్ ద్వారా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పవర్ లూమ్స్ ద్వారా ఉత్పత్తి చేసిన చీరలను చేనేత చీరలుగా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత సహకార సంఘాల వద్ద ఉన్న చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, సబ్సిడీపై ముడి సరుకులు అందించాలని కోరారు. నేతన్న నేస్తం పథకాన్ని చేనేత పరిశ్రమ అనుబంధ రంగాల కార్మికులకు కూడా వర్తింపజేయాలని, చేనేత వస్త్రాలపై పూర్తిగా జిఎస్టీరద్దు చేయాలని పేర్కొన్నారు .కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ హెచ్ డిసి పథకం ద్వారా పాస్ పుస్తకాలు మంజూరు చేసి ,నేరుగా కార్మికులకు నూలు,పట్టు రాయితీ అందించి ,హెల్త్ ఇన్సూరెన్స్ పథకం ప్రవేశ పెట్టాలన్నారు. ఉచిత విద్యుత్ తో పాటు, గుర్తింపు కార్డులు కూడా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం రామచంద్ర, కేరళ ఇన్చార్జి యం .ఇస్మాయిల్ రాష్ట్రఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు ఉద్దంటి ఆదిలక్ష్మి, చేనేత నాయకులు తారక రామారావు ,పురుషోత్తం ,హేమ సుందర్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190